సాక్షి నిర్మల్

మంగళవారం । 6 । జూన్ । 2023



నష్టాల నుంచి లాభాల్లోకి..

నష్టాల నుంచి ఆర్టీసీ సంస్థ మే నెలలో లాభాల బాట పట్టింది. ఉమ్మడి జిల్లాలోని డిపోలకు గతేడాది పోల్చితే ఈ వేసవి సెలవులు కలిసివచ్చాయి.

8లో▸

ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించాలి

నిర్మల్‌టౌన్: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుంచి పలు సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
41.0 / 29.0

వాతావరణం

ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది. మధ్యాహ్నం ఎండ వేడితో ఉక్కపోత అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న జడ్జి కర్ణకుమార్

నిర్మల్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కోర్టులో ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్క నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్, కోర్టు సిబ్బంది, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ

- ఎస్పీ ప్రవీణ్ కుమార్



అర్జీదారుల సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లాలోని ప్రతి ఒక్కరికీ పోలీస్ రక్షణ ఉంటుందని ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు.

రేపు జాబ్‌మేళా

నిర్మల్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 7న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన విశ్వ ఆగ్రోటెక్ కంపెనీలో మార్కెటింగ్ సేల్స్, టీం లీడర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పదోతరగతి, ఆపైన విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ కాపీలతో మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94415 35253 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.


మెనూ ప్రకటించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నిర్మల్‌టౌన్: మధ్యాహ్న భోజన కార్మికులకు కొత్త మెనూ ప్రకారం బిల్లులు, రేట్లు ప్రకటించాలని సంఘం గౌరవ అధ్యక్షుడు భూక్యా రమేశ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ వరుణ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన మెనూకు తగ్గట్లు బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునవ్వ, సీహెచ్ లక్ష్మి, మల్లేశ్, వడ్డెర లక్ష్మి, కార్మికులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలి



మాట్లాడుతున్న గజపల్లి నర్సయ్య

నిర్మల్‌రూరల్: ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించి నూలు సంచులను వినియోగించాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నర్సయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే కాలుష్యాన్ని నియంత్రించడానికి గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు కృత్రిమ రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ వర్మ, గంగన్న, శ్రీనివాస్, వెంకటరమణ పాల్గొన్నారు.

గులాబీలో జోష్



సభకు హాజరైన జనం

- వర్షమొచ్చినా నిండిన సభ
- జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన జనం
- నిరాశపర్చిన జిల్లా కేంద్రం
- అన్నీ తానైన మంత్రి 'అల్లోల'
- పాత హామీలపై ప్రతిపక్షాల విమర్శ

నిర్మల్: నాలుగేళ్ల తర్వాత వచ్చిన గులాబీబాస్, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జిల్లా బీఆర్‌ఎస్ ఘనస్వాగతమే పలికింది. జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సభ విజయవంతమైంది. వరుణుడు పరేషాన్ చేసినా మంత్రి ఇంద్రకరుణుడు అనుకున్న స్థాయిలో జనాలు రావడంతో గులాబీదళంలో జోష్ నిండింది. జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. కానీ.. జిల్లా కేంద్రమే నిరాశపర్చినట్లు పార్టీవర్గాలు పేర్కొంటున్నాయి. నిర్మల్ పట్టణం నుంచే అనుకున్న స్థాయిలో జనసమీకరణ జరగలేదంటున్నారు. మొత్తం మీదు వారం పదిరోజులుగా మంత్రి ఐకేరెడ్డి చేసిన కృషికి తగ్గ ఫలితం వచ్చినట్లు అనుచరులు భావిస్తున్నారు. మరోవైపు జిల్లా ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నా.. పాత హామీలనే సీఎం కొత్తగా చెప్పారంటూ ప్రతిపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి.

వానొచ్చినా.. తరలివచ్చి..

సమీకృత కలెక్టరేట్, బీఆర్‌ఎస్ భవన్ ప్రారంభంతో పాటు పలు కార్యక్రమాల శంకుస్థాపనలకు ఆదివారం సాయంత్రం సీఎం జిల్లా కేంద్రానికి వచ్చారు. సరిగ్గా ఆయన చేరుకునే సమయానికే వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మరో అరగంటలో బహిరంగసభకు వస్తారనగా వాన మొదలైంది. జల్లులతో మొదలై ఓ మోస్తరుగా కురిసింది. అప్పటికి ఇంకా సభాప్రాంగణం నిండనే లేదు. సరిగ్గా జనం వచ్చే సమయానికే వర్షం రావడంతో గులాబీశ్రేణులు కాస్త కంగారుపడ్డాయి. కాసేపటికి జల్లులు ఆగి అధికసంఖ్యలో జనాలు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కాసింత నిరాశే..

ఎన్నికలు వస్తుండటం, నాలుగేళ్ల తర్వాత సీఎం రావడంతో బహిరంగసభకు భారీగానే ఏర్పాట్లు చేశారు. ఆస్థాయిలో జనసమీకరణ కూడా చేశారు. అన్నీ బాగానే ఉన్నాయి.. అని అనుకుంటున్న తరుణంలో వరుణుడు రావడం ఇబ్బంది పెట్టింది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా తన ప్రసంగాన్ని మమ అనిపించేలా 20 నిమిషాలలోపే ముగించేశారు. వర్షం పడే అవకాశం ఉందంటూ ముందే చెప్పిన సీఎం ఎక్కువసేపు మాట్లాడకపోవడం, చాలా అంశాలను చెప్పకపోవడం సభికులను కాసింత నిరాశపర్చింది. స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కూడా కొన్ని నిమిషాలే మాట్లాడాల్సి వచ్చింది. కేవలం కొన్ని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి ముగించారు. వాతావరణం అనుకూలంగా లేకపోవడం వల్లే ప్రసంగాలను కుదించాల్సి వచ్చిందని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు.

పాత హామీలేనంటూ..

ఆత్మీయ సమ్మేళనాల తర్వాత సీఎం సభ విజయవంతం కావడం గులాబీనేతలు, కార్యకర్తలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. సీఎం తన ప్రసంగంలో ఇంజినీరింగ్ కాలేజీతో పాటు నిధుల జల్లు కురిపించడం కూడా వాళ్లల్లో జోష్ పెంచింది. మరోవైపు ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్‌లు మాత్రం సీఎం టూర్ ఫెయిల్ అని, పాత హామీలే తీర్చని సీఎం మళ్లీ వాటినే వల్లెవేశారని ఆరోపణలు గుప్పిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం చెప్పిన కాళేశ్వరం ప్యాకేజీల పనులు పూర్తి కాలేవని, మళ్లీ వాటి గురించే చెప్పడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రైల్వేలైన్ హామీని మరిచిపోయారని, నిర్మల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ముచ్చటనే తీయలేదని ఆరోపిస్తున్నారు. పెద్ద పట్టణమైన నిర్మల్‌కు, చిన్న మున్సిపాలిటీ ఖానాపూర్‌కు సమానంగా నిధులు ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తున్నారు.

అన్నీతానైన 'అల్లోల'..

సీనియర్ లీడర్లు పార్టీని వీడటం, ఉన్నవాళ్లలోనూ కొంతమంది సహకరించకపోవడం, మిగితావాళ్లు పూర్తిస్థాయిలో పనిచేయకపోవడంతో సీఎం పర్యటనకు సంబంధించిన పనులన్నీ మంత్రి అల్లోలపైనే పడ్డాయి. సీఎం పర్యటన ఖరారైనప్పటి నుంచి ఆయన తిరిగి హైదరాబాద్ వెళ్లేవరకూ అన్నిపనులూ ఇంద్రకరణ్‌రెడ్డి దగ్గరుండి చూసుకోవడం కనిపించింది. కొత్త కలెక్టరేట్, బీఆర్‌ఎస్ భవన్, సభాప్రాంగణాలను ఒక్కోరోజులోనే ఒకటికి రెండుసార్లు పరిశీలిస్తూ.. పనులు పర్యవేక్షిస్తూ సీఎం టూర్ సక్సెస్ అనిపించుకున్నారు.

బడి బస్సు బాగుందా?



- ఫిట్‌నెస్ పరీక్షలపై అవగాహన కరువు
- నిర్లక్ష్యం చేస్తున్న యాజమాన్యాలు
- నత్తనడకన వాహన సామర్థ్య పరీక్షలు
- 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

నిర్మల్‌రూరల్: విద్యాసంస్థల బస్సులకు ప్రతీ సంవత్సరం ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. కానీ.. కొందరు పాఠశాలల యాజమాన్యాలు విస్మరిస్తున్నారు. కొన్ని బడి బస్సుల భద్రత ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థులను ఇంటి నుంచి బడులకు తరలించే బస్సులు 'ఫిట్‌లెస్'గా మారుతున్నాయి. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. విద్యాసంవత్సరం ప్రారంభం అవుతుందంటే ముఖ్యంగా గుర్తుకు వచ్చేది బస్సుల ఫిట్‌నెస్. ఇప్పటికే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్మిషన్ల కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. ఈ క్రమంలో విద్యార్థులను తరలించే వాహనాలపై దృష్టి పెట్టడం లేదు.

మరో ఆరు రోజులే గడువు

జిల్లాలో మే 16నుంచి జూన్ 12వరకు విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆర్టీఏ నిబంధనల ప్రకారం ప్రతీ విద్యాసంస్థ ఈ నియమాన్ని పాటించాల్సిందే. బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా రవాణాశాఖ సిద్ధంగా ఉంది. కానీ.. విద్యాసంస్థలు ప్రారంభం కాలేదనే సాకుతో ఇప్పుడే తొందర ఎందుకన్న ధోరణిలో విద్యాసంస్థల యాజమాన్యాలున్నాయి. ఫిట్‌నెస్ పరీక్షలకు మరో 10 రోజుల గడువు మాత్రమే ఉంది. ఇప్పటివరకు జిల్లాలో 25 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ పరీక్షలకు వచ్చినట్లు రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. జిల్లాలో 288 బడి బస్సులున్నాయి. మరో 10 రోజుల్లోగా 263 వాహనాలకు పరీక్షలు చేయాల్సి ఉంది. జూన్ 12 తర్వాత ఫిట్‌నెస్ లేకుండా రోడ్డు ఎక్కే వాహనాలను సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బడి బస్సు భద్రతపై సర్వత్రా అనుమానం వ్యక్తమవుతోంది.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్

ఈనెల 12వ తేదీ వరకు పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షల గడువు ఉంది. గడువు దాటిన తర్వాత ఫిట్‌నెస్ లేకుండా తిరిగే బస్సులను సీజ్ చేస్తాం. ఇప్పటికే యాజమాన్యాలకు ఈ విషయమై స్పష్టం చేశాం. ఆర్టీఏ నిబంధనల ప్రకారం విద్యాసంస్థల యాజమాన్యాలు నడుచుకోవాల్సిందే. ఉల్లంఘిస్తే ఆ బస్సుల పర్మిట్‌ను ఆరునెలల పాటు సస్పెండ్ చేస్తాం. సంబంధిత పాఠశాలల యాజమాన్యాలపై చర్యలకు సిఫారసు చేస్తాం. బడులు తెరవక ముందే పరీక్షలు చేయించుకోవాలి. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా చూడాలి.

– అజయ్‌కుమార్‌రెడ్డి, డీటీవో, నిర్మల్

ఫిట్‌నెస్ నిబంధనలు ఇవే..

- బస్సు 15 ఏళ్ల జీవితకాలం దాటొద్దు.
- బస్సు మంచి సామర్థ్యంతో ఉండేలా చూసుకోవాలి.
- బస్సు స్టీరింగ్, బ్రేకులు, టైర్లు, ఇండికేటర్లు, అత్యవసర ద్వారం, వైపర్లతోపాటు కిటికీలకు గ్రిల్స్ సరిగా ఉండాలి.
- పిల్లలు బస్సు ఎక్కేందుకు, దిగేందుకు అనువుగా ఉండాలి.
- డ్రైవర్ ఆరోగ్యంగా ఉండాలి. నెలకు ఒకసారి బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించాలి. తాగి వాహనం నడపకుండా చూడాలి.
- డ్రైవర్‌కు విధిగా లైసెన్స్ ఉండాలి. డ్రైవర్ వయస్సు 60 ఏళ్లకు మించకూడదు. ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స కిట్ ఉండాలి.
- సైడ్ అద్దాలు, లైట్లు, బస్సు వెనక ఎరుపు రంగు రేడియం టేపు, ముందు తెలుపు రంగు రేడియం టేపు అతికించి ఉండేలా చూడాలి.
- బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేసి ఉండాలి.

ఈ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల యాజమాన్యాలపై ఉంది.

ఐదేళ్లయినా అవే ముచ్చట్లు

- రైల్వేలైన్‌ను మర్చిపోయిండ్రు..
- 'అండర్‌గ్రౌండ్'కు నిధులివ్వలేదు
- పెండింగ్ బిల్లులే రాలేదు..
- కొత్తగా నిధులిస్తారా..?
- సీఎం సభపై బీజేపీ నేత 'ఏలేటి'



సమావేశంలో మాట్లాడుతున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్: నిర్మల్‌లో ఆదివారం జరిగిన సీఎం కేసీఆర్ సభ ఫెయిలైందని, ఐదేళ్ల తర్వాత కూడా అవే ముచ్చట్లు చెప్పివెళ్లారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులే ఇవ్వని కేసీఆర్ రూ.లక్షల కోట్ల నిధులిస్తారా.. అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అధికారిక కార్యక్రమానికి, బహిరంగ సభకు వచ్చినట్లు లేదని, ఏదో ప్రైవేటు ఫంక్షన్‌కు వచ్చినట్లు ఉందని ఎద్దేవా చేశారు. అధికారిక కార్యక్రమానికి అందర్నీ పిలవాల్సింది పోయి, నిర్బంధించడమేంటని ప్రశ్నించారు. రెండువేల ఇళ్లను కట్టించామని చెప్పడంపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇన్నేళ్లు లేని ఖాళీప్లాట్లకు రూ.3 లక్షలు ఇస్తామన్న ముచ్చట ఎన్నికలకు మూడునెలల ముందే ఎందుకు గుర్తొచ్చిందన్నారు. ఐదేళ్ల కిందట చెప్పిన ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లే రాలేవని, ఇప్పుడు మళ్లీ తాలూకాకు ఒకటి ఎక్కడిస్తారని అడిగారు. గొర్రెలకోసం కట్టిన డీడీలకు వడ్డీలు పెరుగుతున్నాయేతప్పా గొల్లకుర్మలకు గొర్రెలు మాత్రం రావడంలేదన్నారు. మంత్రి ఐకేరెడ్డి అవినీతిపై నిజనిర్ధారణ కమిటీ వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ నేతలు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అంజుకుమార్‌రెడ్డి, మెడిసెమ్మె రాజు, రాజేశ్వర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, సాద సుదర్శన్, సాదం అరవింద్, జమాల్, అలివేలుమంగ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో తెలంగాణ ముందంజ

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



ప్రశంస పత్రాలు అందజేస్తున్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్

నిర్మల్‌టౌన్: రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడంలో తెలంగాణ ముందంజలో ఉందని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని దివ్య గార్డెన్‌లో విద్యుత్ ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కులవృత్తుల వారికి 250 మెగావాట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. జిల్లాలో 33/11,220 మెగావాట్ల సబ్‌స్టేషన్‌లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. 24 గంటల విద్యుత్ వల్ల అనేక పరిశ్రమలు రాష్ట్రంలో పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తున్నాయన్నారు. అనంతరం విద్యుత్ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి రాంకిషన్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి జయంత్ చౌహాన్, ఆర్డీవో స్రవంతి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలు

పర్యావరణ పరిరక్షణకు ఎలక్ట్రిక్ వాహనాలు దోహదం చేస్తాయని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. స్త్రీనిధి కింద లబ్ధిదారులకు వాహనాలను అందజేశారు.

ఉత్తమ సేవలకు ప్రశంస పత్రాలు

కుంటాల: విద్యుత్ ప్రగతి విజయోత్సవాల్లో భాగంగా భైంసా ఎస్‌ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఉత్తమ సేవలందించిన మండలంలోని కల్లూర్ జూనియర్ లైన్‌మెన్ విజయ్‌కుమార్, అన్‌మ్యాండ్ శ్రీనివాస్‌కు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రశంసపత్రాలు అందజేశారు. భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ కొత్తపల్లి గంగామణి బుచ్చన్న, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దత్తాత్రి, ఏఈ శివప్రసాద్ వారిని అభినందించారు.

స్వరాష్ట్రంలో నిరంతర విద్యుత్ వెలుగులు

- ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసాటౌన్: స్వరాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాతో రైతుల జీవితాల్లో వెలుగులు నింపిన దార్శనికుడు కేసీఆర్ అని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ కోతలతో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రాత్రివేళల్లో పంటలకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి పాముకాటు, విద్యుత్ ప్రమాదాలతో ఎంతోమంది రైతులు మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. చిన్నచిన్న సమస్యలు అధిగమించుకుంటూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందేలా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. అంతకుముందు కళాకారులు, భైంసా చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. అనంతరం పలువురు ఉద్యోగులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో సుధీర్, భైంసా ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌బాబు, వైస్‌చైర్మన్ సుదర్శన్ పటేల్, బీఆర్‌ఎస్ నాయకులు సోలంకి భీంరావు, బుచ్చన్న, సంజు చౌహాన్, డీఈఈ శ్రీనివాస్‌రెడ్డి, బాసర, భైంసా ఏడీఈలు లక్ష్మణ్, కదం ఆదిత్య, ఎంపీడీవో గోపాలకృష్ణ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విత్తన రాయితీకి మంగళం

- పచ్చిరొట్ట విత్తనాలకే పరిమితం
- మిగతా వాటిపై ఎత్తివేత
- పంపిణీకి సిద్ధంగా జీలుగ విత్తనాలు
- జాడలేని ఆర్‌కేవీవై



నిర్మల్‌చైన్‌గేట్: రాష్ట్రంలో విత్తన రాయితీకి ప్రభుత్వం క్రమంగా మంగళం పాడుతోంది. వరికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని ఓ వైపు చెబుతూనే మరోవైపు ఆ పంటల విత్తనాలపై సబ్సిడీని ఎత్తివేస్తోంది. ఇప్పటికే పత్తి, వరి, కంది విత్తనాలపై రా యితీ ఎత్తేసిన ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలు జీలుగు, జనుము, పిల్లి పెసరపై కొనసాగిస్తోంది. రెండేళ్లుగా ప్రధాన పంటల విత్తనాలపై సబ్సిడీని ఎత్తివేస్తుండటంతో విత్తన భారం రైతులపైనే పడుతోంది. మరోవైపు బహిరంగ మార్కెట్‌లో ప్రధాన పంటల విత్తనాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు కేవలం భూమి బలాన్ని పెంచేందుకే కావడంతో సర్కారు సాయం రైతులకు అందని ద్రాక్షగా మారింది. అయితే పచ్చిరొట్ట పంటల సాగుతో ఎరువుల వాడకం తగ్గి, రైతులకు పెట్టుబడి కలిసివస్తుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాకు జీలుగ మాత్రమే...

సాగు నేలలో సారం పెంచే జీలుగ, జనుము విత్తనాలను మాత్రమే రాయితీపై ఇస్తున్నారు. పిల్లి పెసర, జనుము విత్తనాలకు రాయితీ ప్రకటించినప్పటికీ జిల్లాకు కేటాయించ లేదు. కేవలం జీలుగ విత్తనాలు మాత్రమే 4,500 క్వింటాళ్లకుపైగా జిల్లాకు కేటాయించారు. 37,500 ఎకరాలకు ఈ విత్తనాలు సరిపోతాయని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ తెలిపారు. జిల్లాలోని ఆగ్రోస్ సేవా కేంద్రాలతోపాటు డీసీఎంఎస్ కేంద్రాలు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా ఆన్‌లైన్ విధానంలో అందిస్తామని వివరించారు.

ఇతర విత్తనాల రాయితీకి స్వస్తి..

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో సుమారు 4.10 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారుల అంచనా. ఇందులో ఎక్కువ వరి, పత్తి, సోయా, మొక్కజొన్న, కందులు, మినుములు వంటి పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. గతేడాది 3.90 లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి అదనంగా 20 వేలకుపైగా ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు సమాచారం. ఈసారి పత్తి సాగు విస్తీర్ణాన్ని వీలైనంత వరకు పెంచనున్నారు. మొక్కజొన్న, కందులు, అపరాలు, తృణధాన్యాలను కూడా ప్రోత్సహించనున్నారు. జిల్లాలో రైతులు ఎ క్కువగా ఆగ్రోస్ సేవా కేంద్రాలు, డీసీఎంఎస్, పీఏసీఎస్, ఎఫ్‌పీవో కేంద్రాల్లో విత్తనాలు కొనుగోలు చేస్తుంటారు. సారం పెంచేవే తప్ప ఆయా పంటల విత్తనాలకు రాయితీ లేకపోగా సదరు విత్తనాల ఊసే లేదు. ప్రధాన పంటల్లో వరిలో అన్ని రకాలు, పెసర, కంది, మినుము విత్తనాలకు రాయితీ ఇవ్వలేదు. 2019 వానాకాలం సీజన్‌లో వీటిని 50 శాతం రాయితీపై రైతులకు అందించారు. రాయితీ లేకపోవడంతో రెట్టింపు ధర చెల్లించడం ఈసారి రైతులకు భారంగా మారింది. వరి దొడ్డు రకాలు 30 కిలోల బస్తా ఎంటీయూ 1010 రూ.900, కేఎస్‌ఎం 118 రూ.900 ఉండగా గతేడాది రూ.450కే రాయితీపై అందించారు. ప్రస్తుతం రాయితీ లేక రెట్టింపు ధర చెల్లించాల్సి వస్తోంది.

ఊసేలేని ఆర్‌కేవీవై...

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకం కింద రాయితీపై రైతులకు కూరగాయల విత్తనాలను పంపిణీ చేసేవారు. కూరగాయల సాగుకు 50 శాతం నుంచి 70 శాతం వరకు సబ్సిడీపై విత్తనాల సరఫరా జరిగేది. నాలుగేళ్లుగా ఈ పథకం ఊసే లేకపోవడంతో కూరగాయల రైతులపై అదనపు భారం పడుతోంది. దీంతో సాగుచేసే రైతుల సంఖ్య తగ్గుతోంది. ఉమ్మడి జిల్లాలో వేల ఎకరాల్లోనే కూరగాయల తోటలు సాగయ్యేవి. ఇప్పుడు సబ్సిడీ విత్తనాలు దొరకక ఆ తోటలు కనిపించడం లేదు. ప్రస్తుతం విత్తనాలకు బదులుగా నారు మాత్రమే ఉద్యానవన శాఖ అధికారులు సరఫరా చేస్తున్నారు. ఆ నారు కూడా కేవలం మూడు రకాల కూరగాయలకు మాత్రమే ఇస్తున్నారు.

ఆర్జీయూకేటీ ఆన్‌లైన్ అప్లికేషన్లు ప్రారంభం

భైంసాటౌన్(ముథోల్): బాసర ఆర్జీయూకేటీలో ప్రవేశాలకుగానూ వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీష్‌కుమార్‌తో కలిసి సోమవారం ఆన్‌లైన్ అప్లికేషన్లు ప్రారంభించారు. ఈ నెల 19వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని, టీఎస్ ఆన్‌లైన్ మీసేవ కేంద్రాల్లో ధ్రువపత్రాల అప్‌లోడింగ్, ఫీజు పేమెంట్, తదితర అప్లికేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చన్నారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులైన దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు ఆన్‌లైన్ అప్లికేషన్ అనంతరం 24 జూన్ సాయంత్రం 5 గంటలలోపు ప్రింట్ అప్లికేషన్‌ను వర్సిటీలో అందించాలన్నారు. సందేహాల నివృత్తికి 7416305245, 7416058245, 7416929245 హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలన్నారు. అలాగే admission@rgukt.ac.in కు ఈమెయిల్ చేయవచ్చన్నారు.

అడవులను రక్షించుకుంటేనే మానవ మనుగడ

సారంగపూర్(నిర్మల్): అడవులను రక్షించుకుంటేనే భవిష్యత్‌లో మానవ మనుగడ సిద్ధిస్తుందని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా సోమవారం మండలంలోని చించోలి(బి) సమీపంలోగల గండిరామన్న హరితవనం, అడెల్లి మహాపోచమ్మ ఆలయ పరిసరాల్లోని నందనవనంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు పెంచితే సకాలంలో వర్షాలు కురియడంతో పాటు కలుషితంలేని ప్రాణవాయువును అందిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో పూలు, పండ్ల మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో జైపాల్‌రెడ్డి, డీఆర్‌వో శ్రీదేవి, ఎఫ్ఎస్‌వో పూర్ణిమ, ఎఫ్‌బీవో వెన్నెల, అడెల్లి ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు చర్యలు



సెమినార్‌లో పాల్గొన్న ముఖరా(కె) సర్పంచ్‌ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్‌

ఇచ్చోడ: పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముఖరా(కె) సర్పంచ్‌ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్‌ తెలిపారు. ఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ పర్యావరణ సెమినార్‌లో పాల్గొని వారు మాట్లాడారు. పల్లె ప్రకృతివనం, గ్రీన్‌ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ముఖరా (కె) గ్రామంలో లక్ష మొక్కలు నాటినట్లు తెలిపారు. పర్యావరణంలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌, ఎంపీటీసీలను కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్‌సింగ్‌ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం

- కాలిపోయిన టీవీ, ఫ్రిజ్‌, ఎలక్ట్రానిక్‌ పరికరాలు



టీవీ నుంచి వస్తున్న పొగలు

బోథ్‌: మండల కేంద్రంలోని 8, 9, 10వ వార్డులకు విద్యుత్‌ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో సోమవారం పలు ఇళ్లల్లో 30 టీవీలు, 15 ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్‌ పరికరాలు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో న్యూట్రల్‌ వైరు తెగిపోవడం వల్ల హై ఓల్టేజ్‌ విద్యుత్‌ సరఫరా అయిందని అధికారులు పేర్కొన్నారు. కొన్ని ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌ల నుంచి పొగలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్‌ మెయింటెనెన్స్‌ సరిగా లేకపోవడంతో న్యూట్రల్‌ వైర్‌ తెగిపోయిందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్‌ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బెల్లంపల్లిరూరల్‌: బెల్లంపల్లిలోని ఐటీడీఏ తోట సమీపం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతిచెందాడు. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్‌ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేడ్కర్‌ రడగంబాల బస్తీకి చెందిన ఎండీ హుస్సేన్‌(40) పాత ఇనుప సామగ్రి కొనుగోలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీగా సోమవారం సాయంత్రం తన బైక్‌పై బెల్లంపల్లి నుంచి గురిజాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కన్నెపల్లి నుంచి బెల్లంపల్లికి వస్తున్న కారు బైక్‌ను ఎదురుగా వేగంగా ఢీకొంది. ఒక్కసారిగా హుస్సేన్‌ కిందపడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారును అక్కడే వదిలి డ్రైవర్‌ పరారయ్యాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని హుస్సేన్‌ మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి ఒడ్డున మొసలి సంచారం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున మొసలి సంచరిస్తోంది. సామిల్‌ వెనుకాల నీటి గుంత పక్కన మూడు రోజులుగా మొసలి సంచరిస్తూ జాలరుల కంట పడింది. అటు వైపు నుంచి గోదావరికి చేపల వేటకు వెళ్లే వారు వీడియో తీసి సోషల్‌ మీడియాలో పోస్టు చేశారు. దీంతో మొసలి సంచారం విషయం వైరల్‌గా మారింది. ఫారెస్టు అ.ధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సులు



నష్టాల నుంచి లాభాల్లోకి..

- ఆర్టీసీకి కలిసొచ్చిన వేసవి సెలవులు
- శుభకార్యాలు, విహారయాత్రలకు నడిపిన బస్సులు

మంచిర్యాలఅర్బన్‌: నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థ మే నెలలో లాభాల బాట పట్టింది. గతేడాది మే నెలతో పోల్చితే రూ.7.87 కోట్ల ఆదాయంతో ప్రగతి చక్రం ముందుకు సాగింది. వేసవి సెలవులు ఆర్టీసీకి కలిసివచ్చింది. ఉమ్మడి జిల్లాలో మే నెలలో 78లక్షల 30వేల కి.మీ మేర బస్సులు తిప్పగా గతేడాది కంటే రూ.7.87 కోట్లు లాభాలు వచ్చాయి. ఇతర నెలలతో పోల్చితే మేలో ఆర్టీసీకి ఆదాయం వస్తుందని అంచనా వేసిన ఆర్టీసీ అందుకు తగినట్లుగా బస్సులు తిప్పింది. పెళ్లిళ్లు, విహారయాత్రలు శుభకార్యాలు నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం బస్సులను నడపటంతో ఆశించిన మేర లాభాలు వచ్చాయని ఆర్టీసీ రీజినల్‌ మేనేజర్‌ జానీరెడ్డి తెలిపారు.

మే నెలలో ఆదాయం (రూ.కోట్లలో)

డిపో	2022	2023
ఆదిలాబాద్‌	6.45	8.06
భైంసా	3.18	4.05
నిర్మల్‌	7.19	8.96
ఉట్నూర్‌	1.11	1.56
ఆసిఫాబాద్‌	3.40	4.41
మంచిర్యాల	16.80	18.52
మొత్తం	27.74	35.61

(మే నెలకు సంబంధించి)

డిపో	ఓఆర్‌ 2022	తిప్పిన బస్సులు 2023	కిలోమీటర్లు (లక్షల్లో) 2022	2023
ఆదిలాబాద్‌	79	74	16.51	17.11
భైంసా	79	71	8.91	9.52
నిర్మల్‌	79	72	18.21	19.44
ఉట్నూర్‌	81	62	3.17	3.72
ఆసిఫాబాద్‌	74	69	9.37	9.99
మంచిర్యాల	78	71	16.80	18.52

ఓఆర్‌ తగ్గినా పెరిగిన ఆదాయం..

గతేడాది మే నెలతో సరిచూస్తే ఈ ఏడాది ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్‌) తగ్గిపోయింది. గతేడాది 78 ఓఆర్‌ ఉండగా, ఈ ఏడాది 71 పడిపోయిన ఆదాయంపై ప్రభావం పడలేదు. ఆదిలాబాద్‌ డిపో 74 శాతం ముందు వరుసలతో నిలిచింది. నిర్మల్‌ డిపో 72 శాతంతో రెండో స్థానం నిలవగా, భైంసా డిపో, మంచిర్యాల 71 శాతంతో మూడో స్థానానికి పరిమితమైంది. ఆదిలాబాద్‌ రీజియన్‌వ్యాప్తంగా ఈ ఏడాది మే నెలలో 78 లక్షల 30 వేల కి.మీ మేర బస్సులు నడిపి 71శాతం ఓఆర్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత మే నెలతో పోల్చితే ఈ ఏడాది ముందు వరుసలో నిలిచిన ఆదిలాబాద్‌, నిర్మల్‌ డిపో 3 శాతం, మంచిర్యాల 6 శాతం వెనకబడిపోవటం గమనార్హం. గతేడాది 72 లక్షల 96 కి.మీ బస్సులు నడపగా ఈ ఏడాది 78 లక్షల 30 వేల కి.మీ మేర బస్సులు తిప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా అనుకున్నమేర కంటే ఆదాయం గడిచింది.

పెరిగిన ఈపీకే..

ప్రతి కిలోమీటర్‌కు వచ్చిన ఆదాయం పోల్చితే ఈ ఏడాది మే నెలలో ఆశించిన దానికంటే మెరుగ్గానే ఉంది. రీజియన్‌లో చూస్తే గతేడాది మే నెలలో 38.03 ఎర్నింగ్‌ ఫర్‌ కిలోమీటర్‌ (ఈపీకే) కాగా, ఈసారి 45.48 మేర ఈపీకేతో ఆర్టీసీ దూసుకెళ్లింది. ఆదిలాబాద్‌ 47.12, నిర్మల్‌ డిపో 46.10, మంచిర్యాల 46.11 ఈపీకేతో మూడో స్థానానికి పరిమితమైంది. కుమురంభీం ఆసిఫాబాద్‌ 44.24, భైంసా 42.62, ఉట్నూర్‌ డిపో 42.10తో ఈపీకేలో తర్వాత స్థానం నిలిచాయి. గతేడాది మేనెలతో పోల్చితే మాత్రం 7.45 ఈపీకేతో అదనం లాభాలు గడిచింది.

స్పందించారు.. సాయమందించారు



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సాక్షి స్పందన

బోథ్‌: మండలంలోని గుర్రాల తాండ గ్రామంలో దీనస్థితిలో ఉన్న కుటుంబంపై ఈనెల 3న సాక్షిలో 'ఇంటికి పెద్ద..ఆ చిన్నారి' కథనానికి మానవతావాదులు స్పందిస్తున్నారు. బోథ్‌ మండల కేంద్రానికి చెందిన 1990–91వ బ్యాచ్‌ స్నేహితులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు రూ.10,400లను సోమవారం అందించారు. మణిచంద్ర ఫౌండేషన్‌ సభ్యులు కుటుంబానికి ఫ్యాన్‌తోపాటు సరుకులు, కొంత మంది ఫోన్‌పే ద్వారా నగదు అందించారు. కత్తూరి విశ్వనాథ్‌, అల్లకొండ పోతన్న, కొట్టూరి సత్యనారాయణ, బృహస్పతి, గులాబ్‌ సింగ్‌, మణిచంద్ర ఫౌండేషన్‌ చైర్మన్‌ నాంపల్లి చంద్రమోహన్‌, సాయిని గంగాధర్‌, భరత్‌కుమార్‌ ఉన్నారు.

యువతి అదృశ్యం

నిర్మల్‌రూరల్‌: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు రూరల్‌ ఎస్సై చంద్రమోహన్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. జైల రజిత(30) సోమవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గాలించిన ఫలితం లేకపోయింది. దీంతో రూరల్‌ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అంబరాన్నంటిన క్రీడా సంబరం



మైదానంలో ఆయా జిల్లాల క్రీడాకారులు

- రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ పోటీలు ప్రారంభం
- ఎనిమిది జిల్లాల జట్లు హాజరు

రామకృష్ణాపూర్‌: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌ పట్టణంలోని ఠాగూర్‌ స్టేడియంలో తెలంగాణ రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్‌ పోటీలు సోమవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మరో రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఎనిమిది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు అంతర్జాతీయ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, డీవైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వివిధ జిల్లాల జట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల మార్చ్‌ ఫాస్ట్‌ ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల కెప్టెన్‌లతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో గెలుపోటములను లెక్కచేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, సీనియర్‌ క్రీడాకారులు సంజయ్‌, ఈశ్వరాచారీ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జట్టు శుభారంభం..

లీగ్‌ కమ్‌ నాకౌట్‌ పద్ధతిలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్‌ పోటీల్లో ఆతిథ్య మంచిర్యాల జట్టు శుభారంభం చేసింది. ఉదయం నిర్వహించిన పోటీల్లో కోర్ట్‌ నంబరు–2లో జరిగిన లీగ్‌ మ్యాచ్‌లో వనపర్తి జిల్లాపై మంచిర్యాల జట్టు 4–0 గోల్స్‌తో విజయం సాధించింది. మరో లీగ్‌లో నిజామాబాద్‌ జట్టు మహబూబ్‌నగర్‌పై 6–0 గోల్స్‌తో గెలుపొందింది. కోర్ట్‌ నెంబర్‌–1లో జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు రంగారెడ్డిపై 2–0 గోల్స్‌తో, మెదక్‌ జట్టు ఖమ్మంపై 1–0 గోల్స్‌తో గెలుపొందాయి.

పట్టగొలుసు మింగిన చిన్నారి

- బయటకు తీసిన వైద్యులు
- తప్పిన ప్రాణాపాయం



వెలికితీసిన పట్టగొలుసు

నిర్మల్‌ఖిల్లా: ఆరునెలల చిన్నారి ఆటలాడుకుంటూ కాలి పట్టీని మింగేయగా వైద్యులు చిన్నారి కడుపులో నుంచి బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాల్లోకెళ్తే.. సోమవారం సారంగపూర్‌ మండలం బండ్రేవు తండా గ్రామానికి చెందిన ఆరునెలల చిన్నారి ఆటలాడుకుంటూ కాలి పట్టగొలుసును మింగేసింది. గమనించిన కుటుంబీకులు జిల్లాకేంద్రంలోని స్థానిక ప్రశాంత్‌ జీకే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యుడు ప్రశాంత్‌ తన బృందంతో కలిసి పరీక్షలు చేయగా, గొలుసు కడుపులో ఉన్నట్టు నిర్ధారించారు. నియోనాటల్‌ ఎండోస్కోపీ చికిత్స ద్వారా పట్టగొలుసుని తొలగించడంతో ప్రాణాపాయం తప్పింది. చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

తమ్ముడిని హత్యచేసిన అన్నకు జీవితఖైదు

- రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు

నిర్మల్‌టౌన్‌: సొంత తమ్ముడిని హత్యచేసిన అన్నకు జీవిత ఖైదుతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్‌ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్‌ తెలిపిన వివరాలు.. తానూర్‌ మండలం జల్వా (కె) గ్రామానికి చెందిన నేరస్తుడైన ఇఫ్తేకర్‌ దత్తు, మృతుడు ఇఫ్తేకర్‌ శంకర్‌ (32) అన్నదమ్ములు. ఒకే ఇంట్లో పక్కపక్క పోర్షన్‌లో ఉండేవారు. వీరి తండ్రి గంగాధర్‌ తన ఇద్దరు కుమారులకు చెరో ఆరు ఎకరాల పంట భూమిని ఇచ్చాడు. ఇద్దరికి బోరుబావిని ఏర్పాటు చేశాడు. గంగాధర్‌కు నాలుగెకరాల భూమి, బోరు బావి ఉంది. ఇద్దరు కుమారులకు ఇచ్చిన భూమిలో బోరు బావి నీళ్లు ఉండడం లేదు. తండ్రి గంగాధర్‌ బోరు బావి నుంచి అప్పుడప్పుడు పంట కోసం నీళ్లు ఉపయోగించేవారు. ఈ విషయమై అన్నదమ్ములకు గొడవలు జరుగుతుండేవి. గ్రామ పంచాయతీలో తండ్రి పంచాయితీ పెట్టాడు. కుమారులకు చెరో వారం బోరుబావి నీళ్లు వాడుకోవాలని ఒప్పందం కుదిరింది. కొన్నిరోజుల తర్వాత 2018 మార్చి 20న రాత్రి నేరస్తుడైన దత్తు ఇంటి ముందు కూర్చొన్నాడు. వేరుశనగ పంట ఎండిపోతుందని, తండ్రి బోరు నీళ్లను ఉపయోగించుకుంటానని శంకర్‌ అడిగాడు. దత్తు ఒప్పుకోకపోవడంతో శంకర్‌ను ఇంట్లోకి తీసుకెళ్లి రక్తం వచ్చేలా తీవ్రంగా కొట్టడంతో కింద పడిపోయాడు. తల్లిదండ్రులు, భార్య అతన్ని భైంసా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మార్చి 21న మృతిచెందాడు. మృతుడి భార్య పూజ ఫిర్యాదుతో అప్పటి తానూర్‌ ఎస్సై జి. రాజన్న కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి సీఐ శ్రీనివాస్‌ నేరస్తుని అరెస్టు చేసి చార్జిషీట్‌ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చాడు. పీపీ వినోద్‌రావు 20 మందిని సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో దత్తుకు జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

వడదెబ్బతో ఒకరి మృతి?

బెల్లంపల్లిరూరల్‌: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్‌ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ హనుమాన్‌ బస్తీకి చెందిన ఎర్రోజ్‌ అశోక్‌కుమార్‌(40) బంగారు ఆభరణాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతకొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇదే క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 1న ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. రెండురోజుల తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, ఇతర ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. సోమవారం బెల్లంపల్లిలోని పోచమ్మ చెరువు సమీపంలోని ముళ్లపొదల్లో ఉన్న మృతదేహాన్ని అశోక్‌గా గుర్తించారు. ఎస్సై అక్కడి చేరుకుని పంచనామా నిర్వహించారు. అశోక్‌కు అనారోగ్యం ఉండడం, తిండి తినపోకవడంతో వడదెబ్బకు గురై మృతిచెంది నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడికి భార్య లావణ్య, పదేళ్ల కుమారుడు మణికంఠ, ఆరేళ్ల కుమార్తె శివాణి ఉన్నారు. భార్య, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌

ఉట్నూర్‌రూరల్‌: అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ డీడీ డా.దిలీప్‌కుమార్‌ పేర్కొన్నారు. ఉట్నూర్‌ ఐటీడీఏ కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్‌ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలను శాఖల వారీగా పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్‌ కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్‌, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్‌, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌ మనోహర్‌, డీపీవో ప్రవీణ్‌, మేనేజర్‌ లింగు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్వోఎఫ్‌ఆర్‌ పట్టా మంజూరు చేయాలని ఆదిలాబాద్‌ మండల పిప్పలాదరి గ్రామానికి చెందిన ఆత్రం అయ్యు, జంగు విన్నవించారు.



అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్‌

- తనకు ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్‌ మండలం హనుమాన్‌నగర్‌కు చెందిన సట్ల మమత వేడుకుంది.
- ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని బజార్‌హత్నూర్‌ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కుడిమెత గంగాసాగర్‌ అర్జీ సమర్పించాడు.
- తనకు వికలాంగుల ట్రైసైకిల్‌, ఇల్లు మంజూరు చేయాలని ఉట్నూర్‌ మండలం శంకర్‌నాయక్‌ తండాకు చెందిన జె.మమత కోరింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- దుకాణ సముదాయం పనులు ఆపాలంటూ అఘాయిత్యం
- ఒంటిపై కిరోసిన్‌ పోసుకోగా, అడ్డుకున్న పోలీసులు
- విధులకు ఆటంకం కలిగించారని కేసు



ఒంటిపై కిరోసిన్‌ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తున్న మహబూబ్‌ఖాన్‌, అడ్డుకుంటున్న పోలీసులు

భైంసాటౌన్‌: పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ సమీపంలో చేపడుతున్న దుకాణ సముదాయ పనులు ఆపాలంటూ పట్టణానికి చెందిన మహబూబ్‌ ఖాన్‌ సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలిలా ఉన్నాయి.. సర్వేనంబర్‌ 330లో తమకు చెందిన భూమిని ప్రభుత్వ భూమిగా చూపి మున్సిపల్‌ అధికారులు దుకాణ సముదాయం నిర్మిస్తున్నారని, పనులు నిలిపేయాలంటూ కొద్దిరోజులుగా మహబూబ్‌ఖాన్‌ కుటుంబీకులు అక్కడే బైఠాయించి డిమాండ్‌ చేస్తున్నారు. సోమవారం పనులు అడ్డుకోగా, అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి వచ్చి సముదాయించినా వినిపించుకోలేదు. తహసీల్దార్‌ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. పనులు అడ్డుకోవడం తగదని, ఏదైనా ఉంటే కోర్టు ద్వారా తేల్చుకోవాలని సూచించారు. ఇంతలో మహబూబ్‌ఖాన్‌ ఒంటిపై కిరోసిన్‌ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని అక్కడి నుంచి పంపివేశారు. కాగా, విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్‌ అధికారుల ఫిర్యాదు మేరకు మహబూబ్‌ఖాన్‌, జాకీర్‌ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్‌.శ్రీను తెలిపారు.

ప్రకృతి వనరులను సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఉద్యాన అధికారి సందీప్‌కుమార్‌

ఉట్నూర్‌రూరల్‌: ప్రకృతి వనరులను నిత్యం సంరక్షించాలని, కలుషితం లేని గాలి, నీరును భావి తరాలకు అందించడానికి అందరూ కలిసి నడవాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి (పీహెచ్‌ఓ) గుడిమళ్ల సందీప్‌కుమార్‌ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తుకారాంనగర్‌లో సీపీఎఫ్‌ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని నర్సరీల్లో మామిడి, కొబ్బరి, బొప్పాయి, మునగ మొక్కలు తక్కువ ధరకు ఈ సంవత్సరం నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు ఆర్థికాభివృద్ధి పొందాలంటే త్వరగా ఆదాయాన్నిచ్చే కూరగాయాలు, బొప్పాయి, మునగ పంటలు సాగు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. సర్పంచ్‌ రేణుకాబాయి, సీపీఎఫ్‌ ప్రతినిధులు సత్యనారాయణ, రవి, మంగ, జ్ఞాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో..

భైంసాటౌన్‌: బాసర ఆర్జీయూకేటీలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ, డైరెక్టర్‌ సతీశ్‌ కుమార్‌ క్యాంపస్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై వివరించారు.





బాసర ఆలయంలో పూజలు

భైంసాటౌన్‌: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో మూలనక్షత్రం పూజలో భాగంగా సోమవారం అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాది పూజలు నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్చరణల మధ్య కలశపూజ, గణపతి పూజ, సరస్వతి పూజ, కుంకుమార్చన చేపట్టారు. బాసర అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.